




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 11-4-2025

సంపుటి: 21 సంచిక: 15
పేజీలు: 8 వెల: రూ.1


# కంకర తరలింపు..

## ఆక్రమణలకు మినహాయింపు!



- పలాస సూదికొండ చుట్టూ అక్రమాల బాగోతం
- గతంలో రద్దు చేసిన గ్రావెల్ క్వారీకే కలెక్టర్ అనుమతి
- దాని ఆధారంగా ఇష్టారాజ్యంగా తరలిస్తున్న వైనం
- కేంద్రీయ విద్యాలయానికి స్థలం పేరుతో మరో దందా
- పేదల గుడిసెలు తొలగించిన అధికారులు
- పెద్దల ఆక్రమణలను సేకరణ నుంచి తప్పించి రక్షణ



పలాసలో గ్రావెల్ తవ్వకాల దందా మళ్లీ ప్రారంభమైంది. అయితే ఈసారి కలెక్టర్ ఇచ్చిన జీవోనే చూపించి ఒక ప్రైవేట్ వ్యక్తి ద్వారా అక్రమ తరలింపులకు పాల్పడుతున్నారు. చిత్రమేమిటంటే.. గ్రావెల్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలంటూ 2022లో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించిన క్వారీకే ఇప్పుడు కలెక్టర్ అనుమతించారు. ఆమేరకు ప్రజావసరాల పేరుతో బొడ్డపాడు రెవెన్యూలోని ఎంఐజీ లే-అవుట్‌లో రోడ్డు, లోతట్టు ప్రాంతం ఎత్తు చేయడానికి సూదికొండలోని గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. కొందరు అధికార పార్టీ నేతలు కూడా సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై మంగళవారం మున్సిపల్ సమావేశంలో వైకాపా సభ్యులు లేవనెత్తిన ప్రశ్న అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదానికి దారి తీసింది. 19వ వార్డు సూదికొండ పరిధిలో ప్రజాభిప్రాయం తీసుకోకుండా, కౌన్సిల్ తీర్మానం లేకుండా ఏకపక్షంగా కలెక్టర్ ఇచ్చిన అనుమతితో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను తక్షణమే నిలపాలని కౌన్సిలర్ శిష్టు బృందావతి కౌన్సిల్ ఛైర్మన్‌ను వినతిపత్రం అందించారు. మరోవైపు ప్రముఖ వైద్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు ఆర్డీవోను కలిసి తవ్వకాలు నిలిపివేయాలని వినతిపత్రం అందించారు.



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పలాస మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండలోని 2.50 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాలకు 2020లో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్‌కు ప్రభుత్వం అనుమతించగా,ం అప్పటి మంత్రి అప్పలరాజు క్వారీని ప్రారంభించారు. అయితే అంతర్గత పోరులో భాగంగా కొందరు వైకాపా నాయకులు యువతను రెచ్చగొట్టి తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన చేయించారు. ఈ వ్యవహారం వైకాపాలో గందరగోళం సృష్టించింది. స్థానిక యువకులు క్వారీపై దాడి చేసి యంత్రాలు, ట్రాక్టర్లను అడ్డుకుని, డ్రైవర్‌పై దాడి చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై దువ్వాడ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి మంత్రి అప్పలరాజు జోక్యం చేసుకున్నారు. కానీ ఆ తర్వాత గ్రావెల్ తవ్వకాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, జంట పట్టణాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయని, సూదికొండలో నివాసం ఉంటున్నవారికి నష్టం జరుగుతుందంటూ స్థానికులు వ్యతిరేకిస్తున్నారని చెప్పి సీదిరి అప్పలరాజు డైరెక్షన్‌లోనే 2022లో మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించి గ్రావెల్ క్వారీ అనుమతులను రద్దు చేయించారు. అనంతర పరిణామాల్లో వైకాపాను వీడి టీడీపీలో చేరిన దువ్వాడ శ్రీకాంత్ తన పేరుతో ఉన్న క్వారీ లీజును రద్దు చేయించి ఆ భూమిని కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి వినియోగించాలని కోరుతూ ఎమ్మెల్యే గౌతు శిరీషకు లీజు రద్దు పత్రాలు అందించారు. కట్ చేస్తే.. ఇప్పుడు క్వారీని స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించకుండా, మున్సిపల్ కౌన్సిల్ ప్రమేయం లేకుండా కలెక్టర్ అనుమతి ఇచ్చేయగా.. గ్రావెల్ తవ్వకాలు ప్రారంభమైపోయాయి. గ్రావెల్ తవ్వకాలకు కలెక్టర్ స్థూలంగా అనుమతులు ఇచ్చినా.. ఎక్కడ తవ్వకాలు జరపాలన్న విషయాన్ని

- మిగతా చివరి పేజీలో






# జిల్లా వైద్యాధికారిగా అనిత

- విధుల్లో చేరేందుకు డాక్టర్ సుజాత విముఖత
- ఎఫ్ఏసీగా ఆర్ఎంవోకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా వైద్య ఆరోగ్యశాక అధికారిగా డాక్టర్ కె.అనితకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం అర్ధరాత్రి ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె ప్రభుత్వ సర్వజన అసుపత్రి (రిమ్స్) సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్యధికారిగా విధులు నిర్వహిస్తూ రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడి సస్పెండ్‌కు గురైన బాల మురళీకృష్ణ స్థానంలో మొదట విశాఖ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్) ప్రిన్స్‌పాల్‌గా విధులు నిర్వ హిస్తున్న డాక్టర్ సుజాతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె రెండుచోట్ల విధులు నిర్వహించడం కష్టసాధ్యమని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించడానికి విముఖత చూపించి ఫ్యామిలీ వెల్‌ఫేర్ డైరెక్టర్‌కు లేఖ రాయడంతో, ఆమె పేరుతో జారీ చేసిన ఉత్తర్వులను రద్దుచేశారు. ఆమె స్థానంలో డాక్టర్ కె.అనితకు పూర్తి అదనపు బాధ్యత లను అప్పగించారు. గతంలో ఈమె కాకి నాడ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల సీఎస్ ఆర్ఎంవోగా విధుల్లో ఉన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించడానికి విముఖత చూపిస్తున్నా, ఉన్నతాధికారులు ఒత్తిడితో విధుల్లో చేరేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. జూలైలో కాకినాడ ప్రభుత్వ వైద్య కళాశాల సీఎస్ ఆర్ఎంవో ఉద్యోగ విరమణ చేయనుండడంతో ఆ ఖాళీలో పోస్టింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.










• ఎడిటోరియల్

# వంటింట్లో గ్యాస్ మంట

దేశంలోని కోట్లాది పేద మహిళలకు పొగరహిత వంట సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో 2016లో పీఎం 'ఉజ్వల యోజన'ను ప్రారంభించారు. 'కట్టెల పొయ్యిలో వండే మా తల్లులు గౌరవంగా జీవించాలన్నదే మా ఉద్దేశం' అని కూడా చెప్పారు. అందుకే ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టినట్టు ఆనాడు ప్రధాని మోదీ భావోద్వేగంతో చెప్పిన తీరు ఇప్పటికీ మహిళలకు గుర్తుంది. అ నినాదం ఆయనకూ, ఆయన పార్టీకి రాజకీయంగా ఎంతో లబ్ది చేకూర్చింది. ఇప్పుడు అదే తల్లులపై బండ రూపంలో భారం మోపారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో ఇప్పటికే సామాన్యజనం పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. తాజాగా పెరిగిన గ్యాస్‌బండ భారంతో పేద, మధ్యతరగతి జనం ఆరోగ్యంగా ఎలా ఉండగలుగుతారన్నది ప్రశ్న. పెరిగిన బండ భారం మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. పీఎంయూవై లబ్ధిదారులకు, ఇతర వినియోగదారులకు ఇది భారమే. ఈ పెంపు గ్యాస్ వినియోగదారులకే కాదు సబ్సిడీ కింద సిలిండర్లను అందిస్తున్న పలు రాష్ట్ర ప్రభుత్వాలపైనా భారం పడనుంది. అదేవిధంగా పెట్రోల్, డీజీల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం పెంచింది. అయితే ఈ పెంపు ప్రభావం వినియోగదారులపై పడదని, ఈ భారాన్ని చమురు మార్కెటింగ్ కంపెనీలు భరిస్తాయని కేంద్రం వివరించింది. ఎక్సైజ్ సుంకం పెంపు వల్ల కేంద్రానికి ఆదాయం లభిస్తుంది. 15 రోజులకోసారి పెట్రో ధరలు సమీక్షిస్తూ నిర్ణయం తీసుకునే విధానాన్ని చమురు ఉత్పత్తి సంస్థలు చాలా కాలంగా అమలు చేస్తున్నందున ఎప్పుడైనా ధరలు పెరగడం ఖాయమని తెలుస్తోంది. కొన్నిరోజుల క్రితమే 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.41 మేర ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ)లు తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయం సామాన్యులకు ధరాఘాతమే. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినపుప్పుడు రూ.399 ఉన్న సిలిండర్ ధర.. ఇప్పుడు రూ.900 పైకి ఎగబాకింది. అంటే పదకొండేళ్లలో దాదాపు రెండున్నర రెట్లు పెరిగినట్లు! వంటగ్యాస్ ధర పెంపు భారం గతంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపైనే పడేది. ఉజ్వల పథకాన్ని ప్రారంభించిన తర్వాత అది కొంత తగ్గింది. కానీ ఆ వర్గాల ప్రజలపైనా ప్రధాని మోదీ మొట్టమొదటిసారి భారాన్ని మోపారు. ఇప్పటికే గ్యాస్ ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరగా, భవిష్యత్తులో మరింత భారం మోపే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందిపడుతున్న సాధారణ ప్రజలు.. వంట గ్యాస్ ధరలను అమాంతంగా పెంచటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో ఎదురైన నష్టాలను పూడ్చుకోవటంలో భాగంగా చమురు సంస్థలు వంటగ్యాస్ ధర పెంచాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంపు తప్ప వినియోగదారులపై భారం పడదని కేంద్రప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి సాధారణ ఎన్నికలకు ముందు 2024లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజీల్‌పై లీటర్‌కు రెండు రూపాయల చొప్పున ధర తగ్గించింది. దాంతో మోదీని ఆకాశానికెత్తేశారు. తాజాగా ఎక్సైజ్ సుంకం రూపంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రెండు రూపాయలు విధించింది. అప్పుడు కోల్పోయిన నష్టాన్ని తాజాగా భర్తీ చేసుకుంది. ఈ పెంపు వల్ల రూ.32 వేల కోట్లు అర్జించబోతుంది. ఎక్సైజ్ సుంకం రూపంలో గతంలో కోట్ల రూపాయలు వెనకేసుకున్న ప్రభుత్వం.. వాటిని పారిశ్రామికవేత్తలకు మేలు చేసిందే తప్ప సామాన్యులకు ఉపయోగపడే చర్యలు శూన్యం. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతికూల ఆర్థిక, వాణిజ్య పరిస్థితుల నేపథ్యంలో మోదీ సర్కారు ధరల పెంపు నిర్ణయం తీసుకుందన్నది వాస్తవం. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినప్పుడల్లా ప్రజలను పక్కదారి పట్టించి ధరలు పెంపు భారాన్ని మోపడం కేంద్రానికి కొత్తేం కాదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పుడల్లా బీజేపీ ప్రభుత్వం మతపరమైన అంశాలను ముందుకుతెచ్చి లబ్ది పొందుతూ వస్తోంది. పెట్రో ధరల విషయంలో బీజేపీ ప్రభుత్వం అధికార దోపిడీకి పాల్పడుతున్నది. 'అచ్చేదిన్' ఇప్పుడు కనుచూపు మేరలో కూడా కనిపించడంలేదు. ముడిచమురు ధరలు పెరుగుతుండటం వల్లే భారం వేయాల్సి వస్తుందంటున్న ప్రభుత్వానికి.. అంతర్జాతీయ స్థాయిలో ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని మాత్రం వినియోగదారులకు అందించడం లేదు. ప్రభుత్వం నిజంగా ప్రజలతో ఉందని భావిస్తే ఇంధన ఉత్పత్తులపై అధిక ఎక్సైజ్ సుంకాలను తగ్గించాలి. అభివృద్ధి ముసుగులో భారం మోపే విధానాలను ప్రజలు నమ్మకపోగా వ్యతిరేకిస్తారు. ధరలు తగ్గించేందుకు పాలకులపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములవ్వాలి.

## ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట నియోజకవర్గ వైకాపా ఎంప్లాయిస్ & ఫెన్షనర్స్ వింగ్ ప్రెసిడెంగ్‌గా పోలాకి మండలం, సంత లక్ష్మీపురం గ్రామానికి చెందిన సర్పంచ్ ప్రతినిధి యారబాటి వెంకటరమణను అధిష్టానం నియమించింది. పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్న యారబాటి వెంకటరమణను స్థానిక నాయకులను ప్రోత్సహించేదిశగా ఈ పదవి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా యారబాటి వెంకటరమణ మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కారణమైన ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్య, వైసీపీఉద్యోగ, పింఛన్ దారులు రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు వెళతానని స్పష్టం చేశారు.

## నిధుల స్వాహాపై దర్యాప్తుకు డిమాండ్

(సత్యంన్యూస్, మందస)

మందస మండలం సాబకోట గ్రామంలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన జగన్నాథ స్వామి ఆలయం నిధులు స్వాహాపై ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు జరిపి బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, కొండ దీనబంధు, కంసు లక్ష్మణ్, బికారి బెహరా, హరిబంధు బెహరా, మగతా బెహరా, నీలాంబర, రామారావు ,జగదీష్, బి సాయి భక్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలో సమావేశమయ్యారు. గత ఏడాది ఇక్కడ రథయాత్ర జరపకుండానే రథయాత్ర జరిపినట్టు దేవాదాయ శాఖ ఈవో టి వాసుదేవ్, ఉద్యోగులు వారి బంధువుల పేరిట రూ.70వేల దేవాలయం నిధులు బ్యాంకు ఖాతా ద్వారా విత్ డ్రా చేసుకున్నారని వారు తెలిపారు ఈ విషయంపై సంబంధిత జిల్లా కార్యాలయానికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, ఈ విషయంపై పలాస ఎమ్మెల్యే గౌత శిరీషకు జిల్లా కలెక్టర్ దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు వెల్లడించారు. కాలయాపన లేకుండా తక్షణమే దర్యాప్తు నిర్వహించి ఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు స్వాహాపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోకపోతే మందస దేవాదాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.





అరసవల్లి సూర్యనారాయణస్వామి వారిని శ్రీదత్త విజయానంద తీర్థ స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు, సిబ్బంది స్వామిజీకి స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## అక్రమంగా తరలిస్తున్న సిగరెట్ పెట్టెల పట్టివేత

(సత్యంన్యూస్, విజయనగరం)

అక్రమంగా తరలిస్తున్న సిగరెట్ పెట్టెల వాహనాన్ని గురువారం రాత్రి పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్రమంగా సిగరెట్ పెట్టెలు నిల్వ ఉంచడంతోపాటు తరలిస్తున్నారని డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో జిల్లాలోని చెల్లూరు గ్రామం ఎంవీజీఆర్ కాలేజ్ వద్ద గల ఒక గొడౌన్‌లో ఎస్పీ తన సిబ్బందితోపాటు జీఎస్టీ, రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వ్యాన్ లోపల సిగరెట్ పెట్టెలను పెట్టి వాటిపైన అగ్గిపెట్టె బాక్స్‌లను పెట్టారు. వాటికి మాత్రమే ఎస్‌కే ఎంటర్‌ప్రైజెస్ పేరిట ట్యాక్స్ ఇన్‌వాయిస్ తీసుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఎటువంటి జీఎస్టీ చెల్లించకుండా దొంగ వ్యాపారం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో లోతుగా తనిఖీ నిర్వహించగా 31,500 కార్టన్లలో 3,15,000 సిగరెట్ పెట్టెలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.కోటి 72లక్షల 50వేలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసాదరావు మాట్లాడుతూ పైన తెలిపిన వాహనం, గొడౌన్‌లో ఉన్న సరుకును తదుపరి చర్యల నిమిత్తం సీజ్ చేసి వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులకు నోటీసులు ఇచ్చామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, ఎస్సై రామారావు, జీఎస్‌టి అధికారులు పాల్గొన్నారు.



## పూలే ఆశయాలను కొనసాగించండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహాత్మా జ్యోతీరావు పూలే బీసీల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైకాపా కళింగ సామాజిక రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు (లక్ష్మణరావు) పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఏఐబీసీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పూలే లాంటి సంఘసంస్కర్త బీసీల కోసం వెనుదన్నుగా నిలబడి వారి ఉన్నతికి ఎంతో కృషి చేశారన్నారు. బీసీల కోసమే కాకుండా ఎస్సీ ఎస్టీ మైనార్టీల కోసం కూడా ఆయన పోరాడారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లోనే తామంతా ముందుకు వెళ్దామన్నారు. పూలే తర్వాత బీసీలను గుర్తించిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు టి.లోకనాథం, వి సత్యనారాయణ, పి రామకృష్ణారావు, ఎన్‌సీఆర్ రాజు, హెచ్.రామారావు, బి.పాపన్న యాదవ్, రాంబాబు యాదవ్, శివ యాదవ్, గొర్ల రామారావు, బి.రామారావు, కె.వెంకటేశ్వరరావు, ఆదిత్య, డి.గోవిందరావు, సనపల రామకృష్ణ, తేజ, రమణమూర్తి, బొడ్డేపల్లి నాగేశ్వరరాలు తదితరులు పాల్గొన్నారు.

# ఈడో పెద్ద క్రాక్!

నటీనటులు: సిద్ధు జొన్నలగడ్డ-వైష్ణవి చైతన్య-ప్రకాష్ రాజ్-నరేష్-బ్రహ్మాజీ-రాహుల్ దేవ్-రవిప్రకాష్-సుబ్బరాజు తదితరులు.
సంగీతం: అచ్చు రాజమణి-సామ్ సీఎస్-సురేష్ బొబ్బిలి.
ఛాయాగ్రహణం: విజయ్ చక్రవర్తి.
నిర్మాత: బీవీఎస్ఎన్ ప్రసాద్.
రచన-దర్శకత్వం: బొమ్మరిల్లు భాస్కర్

డీజే టిల్లు.. టిల్లు స్క్వేర్ చిత్రాలతో యువతలో మాంచి క్రేజ్ సంపాదించుకున్న నటుడు.. సిద్ధు జొన్నలగడ్డ. ఆ రెండు బ్లాక్‌బస్టర్ల తర్వాత బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో సిద్ధు నటించిన'జాక్' ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. ఈ రోజే రిలీజైన ఈ చిత్రం.. ఆ అంచనాలను ఏమేర అందుకుందో చూద్దాం పదండి.




సాంకేతిక వర్గం: 'జాక్'కు అచ్చు రాజమణి.. సామ్ సీఎస్.. సురేష్ బొబ్బిలి.. ఇలా ముగ్గురు సంగీత దర్శకులు పని చేశారు. కానీ పాటల్లో ఒక్కటీ ఎంగేజ్ చేయదు. వినసొంపుగా అనిపించే పాటే లేదు సినిమాలో. నేపథ్య సంగీతంలోనూ ప్రత్యేకతేమీ లేదు. విజయ్ చక్రవర్తి ఛాయాగ్రహణం ఓకే. నిర్మాణ విలువలకేమీ ఢోకా లేదు. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ బొమ్మరిల్లు భాస్కర్.. తనకు ఏమాత్రం సూట్ కాని కథను ఎంచుకోవడంతోనే దారి తప్పేశాడు. పోనీ ఆ కథలో ఏమైనా కొత్తదనం చూపించాడా అంటే అదీ లేదు. అసలే రొటీన్ కథ.. పైగా సన్నివేశాల్లోనూ వైవిధ్యం లేకపోవడంతో అతను ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయాడు. ఎక్కడా భాస్కర్ ముద్ర కనిపించలేదీ సినిమాలో.

ఏదైనా ఒక హీరో పాత్ర ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేసి అది కల్ట్ స్టేటస్ తెచ్చుకుంటే.. ఆ హీరో తర్వాత చేసే చిత్రాలకు అది బలహీనతగా మారే ప్రమాదం ఉంటుంది. ఎందుకంటే మళ్లీ ప్రేక్షకులు ఆ హీరో నుంచి అదే స్థాయి వినోదం ఆశిస్తారు. ఆ స్థాయి ఎంటర్టైనమెంట్ లేకపోతే నిరాశ చెందుతారు. అలా అని ముందు సినిమా తరహా వినోదమే ట్రై చేస్తే అది కొత్త కథలో సింక్ కాకపోవచ్చు. మొత్తంగా కథే చెడిపోవచ్చు. 'జాక్' సినిమాలో సరిగ్గా అదే జరిగింది. డీజే టిల్లు.. టిల్లు స్క్వేర్ చిత్రాల తో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సిద్ధు జొన్నలగడ్డ.. 'జాక్' సినిమాలోనూ తన మార్కు అల్లరితో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయడానికి ప్రయత్నించాడు. అతడి పంచులు ప్రేక్షకులను అక్కడక్కడా నవ్విస్తాయి. కానీ ఈసారి అతను చేసిన పాత్ర అల్లరి చేయదగ్గది కాదు మరి. రా ఏజెంట్ కావాలనుకునే వ్యక్తి ఎంత సీరియస్‌గా ఉండాలి? అతను చేపట్టే మిషన్ ఎంత పకడ్బందీగా సాగాలి? కానీ 'జాక్'లో వ్యవహారం మొత్తం నాన్ సీరియస్ గా.. అల్లరల్లరిగా సాగిపోయింది. కథేమో సీరియస్.. హీరో పాత్రేమో నాన్ సీరియస్.. రెంటికీ అస్సలు సింక్ కాక 'జాక్' రెంటికీ చెడ్డట్లు తయారైంది.

**కథ:**

పాబ్లో నరుడా అలియాస్ జాక్ (సిద్ధు జొన్నలగడ్డ) చిన్నప్పట్నుంచి కొంచెం భిన్నంగా పెరిగిన కుర్రాడు. అతడిలో చాలా ప్రతిభ ఉన్నా.. తనకెన్నో అభిరుచులు ఉన్నా.. ఒక పద్ధతి ప్రకారం దేన్నీ నేర్చుకోకపోవడంతో ఎందులోనూ నైపుణ్యం సంపాదించలేకపోతాడు. కానీ తన తల్లికి మాత్రం అతడి మీద అపార నమ్మకం. కానీ ఆమె హఠాత్తుగా చనిపోతుంది. తండ్రి జాక్ ను అర్థం చేసుకోడు. చదువు పూర్తయ్యాక సంప్రదాయ ఉద్యోగాలు చేయడం ఇష్టం లేని జాక్.. రా ఏజెంట్ కావాలనుకుంటాడు. అందుకోసం ఇంటర్వ్యూ కూడా పూర్తి చేస్తాడు. ఐతే ఉద్యోగం కన్ఫమ్ అయ్యేలోపు ఒక పెద్ద మిషన్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న జాక్.. రా బృందం దృష్టిసారించిన టెర్రరిస్టు గ్యాంగ్ ను టార్గెట్ చేస్తాడు. మరి రా టీం కంటే ముందు అతను టెర్రరిస్టులను పట్టుకోగలిగాడా.. అతడి మిషన్ గురించి తెలిశాక రా టీం ఎలా స్పందించింది.. చివరికి జాక్ లక్ష్యం నెరవేరిందా లేదా అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

ఇండియా మీద ఎటాక్ చేయడానికి చూసే ఉగ్రవాదుల గ్యాంగ్.. వాళ్లను కట్టడి చేయడానికి ప్రయత్నించే రా టీం.. ఈ సెటప్ లో బాలీవుడ్ వాళ్లు కథల్ని పీల్చి పిప్పి చేసేశారు. ఈ కథలు మరీ మూసగా తయారవుతుండడంతో ప్రేక్షకులు కూడా వాటిని లైట్ తీసుకుంటున్న రోజుల్లో.. ప్రేమకథలకు పేరుపడ్డ బొమ్మరిల్లు భాస్కర్ ఆ జానర్ ట్రై చేయడం ఆశ్చర్యకరం. ఇంతకుముందు 'ఒంగోలు గిత్త'తో తనకు సూట్ కాని మాస్ సినిమా ట్రై చేసి బోల్తా కొట్టిన భాస్కర్.. ఈసారి కూడా తనకు ఏమాత్రం నప్పని కథనే ట్రై చేశాడు. సిద్ధు పాత్రను కొంచెం ఆసక్తికరంగానే రాసుకున్నప్పటికీ.. టెర్రరిస్ట్-రా సెటప్ మాత్రం పరమ రొటీన్ గా డిజైన్ చేసుకోవడంతో 'జాక్' ఏ దశలోనూ ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయింది. ఆరంభంలో ఒక 20 నిమిషాలు 'జాక్' కొంచెం ఉత్సాహంగా సాగి ప్రేక్షకుల్లో ఆశలు రేకెత్తిస్తుంది. కొడుకు ఏం పని చేస్తున్నాడో అంతుబట్టని తండ్రి అతడి ఉద్యోగాన్ని కనిపెట్టేందుకు డిటెక్టివ్ ఏజెన్సీని ఆశ్రయించడం క్యూరియాసిటీ పెంచుతుంది. 'జాక్'కు క్యాప్షన్ గా పెట్టిన 'కొంచెం క్రాక్' అనే మాటను జస్టిఫై చేస్తూ సాగే హీరో క్యారెక్టర్ తిక్క తిక్కగా ప్రవర్తిస్తూ ప్రేక్షకులను నవ్విస్తుంది. రా ఏజెంట్ కావడం కోసం హీరో ఇంటర్వ్యూ అటెండ్ చేసే వరకు సినిమా లైన్లోనే ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ ఏజెంట్ గా తనకు ఉద్యోగం కన్ఫమ్ కావడానికి ముందే హీరో మిషన్లోకి దిగిపోయి చేసే విన్యాసాలే విడ్డూరంగా అనిపిస్తాయి. టెర్రరిస్టులను పట్టుకునే మిషన్ అంటే థ్రిల్లింగా ఉంటుందని ఆశిస్తాం. ఐతే ఈ వ్యవహారమంతా అల్లరిగా.. కంగాళీగా సాగుతూ ప్రేక్షకులకు విసుగు పుట్టిస్తుంది.

ప్రకాష్ రాజ్ చేసిన రా అధికారి పాత్రను జోకర్ తరహాలో మార్చేసి కామెడీకి వాడుకోవడం 'జాక్' ఎంతగా దారి తప్పిందో చెప్పడానికి ఉదాహరణ. ఒక సీన్లో ఉన్నతాధికారి వీడియో కాల్ చేసి మిషన్ గురించి అప్ డేట్ అడిగితే.. ఒక వ్యక్తిని పట్టుకున్నామని ప్రకాష్ రాజ్ చెబుతాడు. మధ్యలో సిద్ధు లైన్లోకి వచ్చి 'వాడ్ని పట్టుకుంది కూడా నేనే సార్' అని వెళ్లిపోతాడు. కాల్ కట్ చేసి ప్రకాష్ రాజ్ గావు కేకలు పెడతాడు. 'జాక్' ఎంత నాన్ సీరియస్ మూవీనో ఈ సీన్ ఒక్కటి చూసి చెప్పేయొచ్చు. 'రా' చుట్టూ కథను నడుపుతూ ఇలాంటి సిల్లీ కామెడీ సీన్లు పెట్టి ప్రేక్షకులను సినిమాలో ఇన్వాల్వ్ చేయొచ్చని ఎలా అనుకున్నారో మరి. టెర్రరిస్టులు-రా సెటప్ ఇలా ఉంటే.. హీరోయిన్ తో రొమాంటిక్ ట్రాక్ ఇంకా పేలవం. డిటెక్టివ్ ఏజెన్సీ నడిపే అమ్మాయిగా వైష్ణవి చైతన్య పాత్ర.. ఆమెతో సిద్ధు రొమాన్స్ ఏమాత్రం వర్కవుట్ కాలేదు. ఆ ట్రాక్ అంతా బలవంతంగా ఇరికించినట్లు అనిపిస్తుంది. ఆరంభ సన్నివేశాల వల్ల ప్రథమార్ధం అయినా ఓ మోస్తరుగా అనిపిస్తుంది కానీ.. రెండో అర్ధం అయితే పూర్తిగా తేలిపోయింది. హీరో రా ఏజెంట్ అవ్వాలనుకోవడం వెనుక ఉన్న డెప్త్ లేదు. ఈ ఎమోషన్ వర్కవుట్ కాకపోవడంతో తర్వాతి కథతో కనెక్ట్ కాలేం. ద్వితీయార్ధంలో సన్నివేశాలు మరీ రొటీన్ గా తయారై పూర్తిగా ఆసక్తి సన్నగిల్లిపోతుంది. సిద్ధు జోకులు మాత్రమే అంతో ఇంతో ఎంగేజ్ చేస్తాయి కథ సంగతి లైట్ తీసుకుని సిద్ధు కామెడీ పంచులను ఆస్వాదించడానికి సిద్ధపడితే తప్ప 'జాక్'తో అంతో ఇంతో కనెక్ట్ కాలేం.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

### నటీనటులు:

సిద్ధు జొన్నలగడ్డ క్యారెక్టర్ మారినా ఇంకా టిల్లు హ్యాంగోవర్లోనే ఉన్నాడా అనిపిస్తుంది జాక్ చూస్తుంటే. టిల్లు స్టైల్లోనే నాన్ స్టాప్ గా మాట్లాడుతూ.. అల్లరి చేస్తూ సిద్ధు ప్రేక్షకులను ఎంటర్టైన్ చెయ్యడానికి చూశాడు. అది సినిమాకు బలమో బలహీనతో చెప్పలేని పరిస్థితి. సిద్ధు పంచులు అక్కడక్కడా నవ్వించాయి కానీ.. తన పాత్ర-కామెడీ సినిమాలో సింక్ కాలేదు. కానీ సినిమాలో ప్రేక్షకులను ఎంగేజ్ చేసేది సిద్ధు మాత్రమే. వైష్ణవి చైతన్య.. సిద్ధు పక్కన కథానాయికగా సూట్ కాలేదు. తన పక్కన చిన్న పిల్లలా అనిపిస్తుంది. ఆమె పాత్ర.. నటనలో ప్రత్యేకత ఏమీ లేదు. ప్రకాష్ రాజ్ ఇలాంటి పాత్రలు ఎన్ని చేశాడో లెక్క లేదు. ఆయన పాత్రను చూడగానే మొనాటనస్ ఫీల్ కలుగుతుంది. విలన్ పాత్రలో రాహుల్ దేవ్ పరమ రొటీన్ అనిపిస్తాడు. సిద్ధు తండ్రి పాత్రలో నరేష్ ఆరంభంలో కొంచెం ఎంటర్టైన్ చేశాడు కానీ.. తర్వాత ఆ పాత్రను పక్కన పడేశారు. సుబ్బరాజు.. రవి ప్రకాష్.. మిగతా ఆర్టిస్టులంతా మామూలే.

## ఘనంగా పూలే 199 వ జయంతి వేడుకలు



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతి రావు పూలే 199 వ జయంతి వేడుకల సందర్భంగా మహాత్మా జ్యోతి రావు పూలే, ఎన్టీఆర్, యర్రంనాయుడు చిత్రపటాలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు పూలే అని కొనియాడారు. మహిళా అభ్యుదయవాది, నిరంతరం మహిళల విద్యభివృద్ధికై పాటుపడిన ఆదర్శప్రాయుడన్నారు. సమాజంలోని కులపరమైన వివక్షను, అన్యాయాలను రూపుమాపడానికై తన జీవితాన్ని దారపోసిన మహాత్ముడు మహాత్మ జ్యోతి రావు పూలే అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కోలనీలోగల స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లుగా బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. శాంతినగర్ కోలనీ పోలింగ్ బూత్ అధ్యక్షురాలు బలివాడ వెంకట జాహ్నవి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పైడి సింధూర, ఆరంగి సతీష్‌కుమార్, బలివాడ విజయసారధి, దుండంగి శేషగిరి, జలగడుగుల గోవిందరావు, అడపా శాంతి, ఆసూరు ఉమామహేశ్వర రావు, బిందు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## చంద్ర మౌలేశ్వరునికి ప్రత్యేక పూజలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేటలో నాగావళి నదీతీరాన వెలసిన శ్రీచంద్రమౌళీశ్వర ఆలయంలోని మహాశివునికి పుష్పాభిషేకంను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ పుష్ప, శేఖర్‌తోపాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వైకాపా శ్రీకాకుళం నియోజకవర్గ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన జ్యోతీరావుపూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంధవరపు సూరిబాబు, రౌతు శంకర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, మామిడి శ్రీకాంత్, ఎచ్చెర్ల శ్రీధర్, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘురామ్, చిట్టి జనార్ధన, పీస గోపి, ముంజేటి కృష్ణ, మెంటాడ స్వరూప్, రుప్ప అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కొనియాడారు. పూలే జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సామాజిక సంఘ సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా నిలిచారన్నారు. అయన స్థాపించిన సత్య శోధక సమాజం దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమంగా పేరుగాంచి కుల మత వర్ణ విబేధాలకు స్వస్తి పలికారన్నారు. నాటి కాలంలో విద్యావ్యవస్థకు పెద్దపీట వేసి పూలే అతని భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి భారతదేశంలో మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందారన్నారు. భారతదేశం లో బాలికల కోసం మొట్టమొదటిసారిగా ఒక పాఠశాల ప్రారంభించిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని, అలాంటి మహానుభావుడు యొక్క జీవిత చరిత్రను ప్రతి ఒక్క ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకల్లో ఆర్మ్ రిజర్వ్ డిఎస్పీ శేషాద్రి, ఆర్ఐ కె నర్సింగరావు, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సైకిల్ యాత్రికుడికి సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


సుప్రసిద్ధ క్రికెటర్ ధోని అభిమాని అయిన ఓ 18 ఏళ్ల యువకుడు కలకత్తా నుండి చెన్నై వరకు సైకిల్ యాత్ర చేస్తున్నాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీ జిల్లా ఆరామ్‌భాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుర్‌పూర్ గ్రామానికి చెందిన సౌవిక్ ముర్ము కలకత్తా నుండి గత తొమ్మిది రోజులుగా సైకిల్ యాత్ర చేసుకుంటూ జాతీయ రహదారి మీదుగా శుక్రవారం శ్రీకాకుళం చేరుకున్నాడు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యుఎఫ్ రాష్ట్రకార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, వ్యాపారవేత్త కృష్ణారావు దుశ్శాలువాతో ముర్మును సత్కరించి ఆయన ప్రయాణానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించారు. మరో 10 రోజులు పాటు తన ప్రయాణం సాగించి చెన్నైలో ధోనీని కలుసుకోవడమే లక్ష్యమని ముర్ము అంటున్నాడు.



## మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలంటూ పూజలు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేనపార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఆ పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు వాండ్రంగి గ్రామంలో శ్రీ శ్రీనివాసనంద స్వామీజీ అశీర్వాదంతో వాండ్రంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతారాముల కల్యాణమండప ప్రారంభోత్సవం జరిగింది. జనసేనపార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్‌శంకర్ స్కూల్ పిల్లలు సింగపూర్ స్కూల్‌లో అగ్ని ప్రమాదానికి గురయ్యారు. ఈనేపథ్యంలో మార్క్ శంకర్ ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని ఆకాంక్షిస్తూ పిసిని చంద్రమోహన్, ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానందస్వామి ఆశ్రమంలో మార్క్ శంకర్ పేరున ప్రత్యేక హోమాలు చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన కార్పొరేషన్ చైర్మన్, మాజీమంత్రి కిడారి శ్రవణ్, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు బూపతి అర్జున్‌కుమార్, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్తకార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, నియోజకవర్గ నాయకులు రాపాక నాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు మీసాల రవికుమార్, వేదపండితులు, ఆయా ఆశ్రమాల స్వామీజీలు పూజలు చేశారు.





వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగుల వరప్రసాద్ తన తండ్రి జ్ఞాపకార్థం కొత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నిత్యం స్వచ్ఛమైన తాగునీరు అందే విధంగా ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

– సత్యంన్యూస్, కొత్తూరు

## వైద్య విద్యలో సాయిప్రియ విశేష ప్రతిభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణానికి చెందిన కింతలి సాయిప్రియ వైద్యవిద్యలో తన ప్రతిభను ప్రదర్శించింది. రేడియో డయాగ్నస్టిక్ ఎండీ కోర్సులో ఎన్టీఆర్ యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన తుదిఫలితాల్లో ఆమె రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. కింతలి సాయిప్రియ కాకినాడ ఆర్‌ఎంసీ కాలేజ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేయగా రాజమండ్రి జిఎస్‌ఎల్ కళాశాలలో ఎండి రేడియో డయాగ్నస్టిక్ విభాగంలో విద్యను అభ్యసించారు. తుది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకొందని తల్లితండ్రులు తెలిపారు. సాయిప్రియ ఈ సందర్భంగా మాట్లాడుతూ రేడియో డయాగ్నస్టిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా స్థిరపడాలని, వైద్య సేవలు మరింతమందికి అందించాలని తన లక్ష్యమని వెల్లడించారు. సాయిప్రియ తండ్రి కింతలి కాళిదాసు హోమియో వైద్యులుగా ఉంటూ మెడికల్ వ్యాపారంలో స్థిరపడ్డారు. తల్లి గొండు వెంకటలక్ష్మి నగరంలోని బలగ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆమె చెల్లి అపర్ణ కూడా ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తిచేసి హౌస్ సర్జన్‌గా విద్యను కొనసాగిస్తున్నారు. ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయి ప్రియను ఆమె స్నేహితులు, బంధువులు, మిత్రులతో పాటు పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.



## వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవాలి




(సత్యంన్యూస్, బూర్జ)

ప్రతి విద్యార్థి విద్యతోపాటు అనేక రకాల జీవిత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఒకేషనల్ విద్య కన్సల్టెంట్ బి.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం బూర్జ మండలం ఓవీ పేట ఆదర్శ పాఠశాలను సందర్శించారు అనంతరం ఒకేషనల్ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలల్లో జీవిత నైపుణ్యాలను నేర్చుకోవడం, వాటిని అభ్యసించడం వల్ల విద్యార్థులు పాఠశాలలో, వెలుపల మెరుగైన, మరింత దృష్టి కేంద్రీ కృత సంతృప్తికరమైన జీవితాన్ని ఎలా గడపవచ్చో తెలుసుకోవచ్చ న్నారు. విద్యార్థి ఏ అధ్యయన రంగాన్ని ఎంచుకున్నా, తరగతి గది వెలుపల విజయానికి వారిని సన్నద్ధం చేయడంలో అనేక రకాల జీవిత నైపుణ్యాలు కీలకమైనవన్నారు. విద్యార్థి కొన్ని తెలివైన పనులను ఎంపిక చేసుకోవడం, ఆరోగ్యకరమైన సంబంధాలను నిర్మించుకోవడం, సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మకంగా ఆలోచించడం వంటి సామర్థ్యాలు వారి జీవితాలపై స్వయంప్రతిపత్తినిస్తాయని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్ ఒకేషనల్ టీచర్ వి.మోహిని కుమారి రాబోయే విద్యా సంవత్సరానికి 10వ తరగతికి వెళ్లే విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్, జాబ్ వర్క్, ఐటిఐ తదితర కోర్సుల్లో అవగాహన కొరకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వచించారు. కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ కో–ఆర్డినేటర్ బి.తిరుపతిరావు, శంకర్రావు, ఓసిడిఓ మేడం నీరజాక్షి తదితరులు పాల్గొన్నారు

## రైతుల ప్రయోజనాలను బలి తీసుకోవద్దు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)


భారత్ అమెరికన్ సామ్రాజ్యవాదానికి లొంగిపోయి రైతుల ప్రయోజనాలను బలి తీసుకుంటుందని, తక్షణమే ఇటువంటి విధానాలను విడనాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చందర్రావు, కె. మోహన్‌రావులు డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్‌సభ 90వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చిలకపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జెండాను సీనియర్ నాయకులు తోనంగి నందివాడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ జమిందారి విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో భాగంగా ఏఐఎస్‌కే ఆవిర్భవించిందన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. సి2 ప్లస్ 50% ప్రకారం రైతులు పండించే పంటలకు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించేందుకు నిరాకరిస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులలో కోతలు విధిస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ రైతాంగ ప్రయోజనాలను నిరాకరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ అడుగుజాడలలో నడుస్తుందన్నారు. నారాయణపురం భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధరల జాబితాలో చేర్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ఈ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా రైతులంతా సంఘటితంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరాడ అప్పన్న, కే .రాజేశ్వరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



## పూలే, కస్తూరిభాగాంధీలు సామాజిక చైతన్యమూర్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సామాజిక చైతన్యానికి పోరాటానికి మహాత్మ జ్యోతిరావు పూలే, కస్తూరిభాగాంధీలు స్ఫూర్తిగా నిలుస్తారని ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంతి, స్వాతంత్ర సమరయోధురాలు కస్తూరిబా గాంధీ 156వ జయంతి వేడుకలు నగరంలోని గాంధీమందిరంలో స్వాతంత్ర సమరయోధులు, సంఘ సంస్కర్తలు స్మృతివనంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. విగ్రహ సమర్పకులు ప్రొఫెసర్ విష్ణుమూర్తితోపాటు మందిర ప్రతినిధులతో కలిసి ఐసీడీఎస్ పీడీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీ శాంతిశ్రీ మాట్లాడుతూ అర్ధనారీశ్వరతత్వానికి ప్రతిరూపాలుగా వీరి జీవితాలు నిలుస్తాయన్నారు. మహిళల విద్య కోసం తన భార్యను ప్రోత్సహిస్తూ సామాజిక చైతన్యానికి జ్యోతిరావు పూలే జీవనపర్యంతం కృషి చేశారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అహరహం పోరాడారని ఆమె చెప్పారు. స్వాతంత్రోద్యమంలో మహాత్మాగాంధీజీకి తోడుగా కస్తూరిబా గాంధీ నిలుస్తూ ఉద్యమంలో మహిళలను ఏకం చేయడంలో కీలక పాత్ర వహించారన్నారు. మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు సమరయోధుల స్మృతివనం ఎంతగానో దోహదపడుతుందని పీడీ కొనియాడారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ పైడి సింధూర, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, జామి భీమశంకర్, పొన్నాడ రవికుమార్, నక్క శంకర్రావు, పందిరి అప్పారావు, బుడుమూరు సూర్యారావు, పి.పద్మావతి, మానవతా సంస్థ ప్రతినిధులు పి.పార్వతీశం, తర్లాడ అప్పలనాయుడు, ఇంజనీర్ శ్రీనివాసరావు, పి.మణి తదితరులు పాల్గొన్నారు


















కంకర తరలింపు..

# ఆక్రమణలకు మినహాయింపు!

(మొదటిపేజీ తరువాయి)


మైనింగ్, రెవెన్యూ అధికారులు నిర్ధారించ లేదు. ఇదే అదనుగా ఎంఐజీ కాంట్రాక్టర్ తనకు అనుకూలమైన ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలించుకుపోతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుని ఆందోళన చేసిన వారంతా ఎక్కడికి పోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు సూదికొండలో డి-పట్టా భూమిని కబ్జా చేసిన వైకాపా, టీడీపీ నాయకులు పద్మనాభపురం, కాశీబుగ్గ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కొనుగోలు, వారసత్వంగా నమోదు చేయించుకున్నారు.


**పేదల గుడిసెలు తొలగింపు**

కేంద్రీయ విద్యాలయం పేరుతో సూదికొండ వద్ద పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 51లో 12.50 ఎకరాలను ఇటీవల రెవెన్యూ అధికారులు సేకరించారు. ఆ భూముల్లో ఉన్న పేదల గుడిసెలను నేలమట్టం చేసి ఆక్రమణలు తొలగించారు. ఇప్పుడు కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని చదును చేస్తున్నామన్న సాకుతో ఎంఐజీ కాంట్రాక్టర్‌కు అప్పగించి గ్రావెల్‌ను తరలించుకుపోవడానికి అవకాశం కల్పించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న ప్రాంతంలోనే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానున్నట్లు కూటమి నాయకులు ప్రకటించగా.. మరో వైపు అందులో టీడీపీ నేత అనుభవంలో ఉన్న నాలుగు ఎకరాలను మినహాయించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారని విశ్వసనీయంగా తెలిసింది. కేంద్రీయ విద్యాలయానికి డి-పట్టా భూమి సేకరించడంపై టీడీపీ నాయకుడు కామేశ్వరరావు అభ్యంతరం తెలిపారని తెలిసింది. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి కొనుగోలు చేసిన భూమిని ఆక్రమణగా చూపించి సేకరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించిన తర్వాత కేంద్రీయ విద్యాలయానికి పది ఎకరాలు సరిపోతుందని అధికారులు నిర్ణయించి కామేశ్వరరావు భూమిని మినహాయించారని ఆరోపణలున్నాయి. కేంద్రీయ విద్యాలయం కోసం రెవెన్యూ అధికారులు సేకరించిన భూమి పురుషోత్తపురం సర్వే నెంబర్ 51లో ఉంది. ఈ సర్వే నెంబర్‌లో ఉన్న డి-పట్టా భూమిని పద్మనాభపురం సర్వే నంబర్ 395/1, 362/2, కాశీబుగ్గ రెవెన్యూ పరిధిలో 234/1లో ఉన్న జిరాయితీ భూమిగా చూపించి అందరూ కొనుగోలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్‌లో సర్వే నెంబర్ 51 డి-పట్టాగా చూపిస్తుంటే ఆక్రమణదారుల వద్ద మాత్రం పక్కా సర్వే నెంబర్లతో కొనుగోలు చేసినట్టు పత్రాలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. కేంద్రీయ విద్యాలయం కోసం ఇటీవల సేకరించిన భూమిలో ఉన్న ఆక్రమణలన్నీ ఈ కోవకు చెందినవే.

**పెద్దల ఆక్రమణలకు మినహాయింపు**

వైకాపా, టీడీపీ నాయకులు కొనుగోలు చేసి పేదలకు విక్రయించిన భూమిని, ఆక్రమణలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు సేకరించారు. అదే సమయంలో డి-పట్టా భూమి ఆక్రమించి వేసిన లే అవుట్ పక్కనే జిరాయితీ సర్వే నెంబర్లు వేసి వేరే వ్యక్తి కొనుగోలు చేసినట్లు చూపిస్తున్న డి-పట్టా భూమిని మాత్రం మినహాయిస్తున్నారని పట్టణంలో చర్చించుకుంటున్నారు. కేంద్రీయ విద్యాలయం కోసమంటూ ఎన్నో ఏళ్ల నుంచి పేదలు నిర్మించుకున్న గుడిసెలను ఆక్రమణల పేరుతో తొలగించారు. అయితే మొదట మార్కింగ్ ఇచ్చి తొలగించిన స్థలంలో అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దల భూమి సుమారు నాలుగు ఎకరాలను మినహాయించినట్టు ఆరోపణలు న్నాయి. పెద్దల చేతిలో ఉన్న ఈ భూమిని కేంద్రీయ విద్యాలయం స్కెచ్ నుంచి మినహాయించి, దీనికి బదులుగా సూదికొండలో కొత్తగా మార్కింగ్ ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ప్రయోజనాలను కాపాడటానికి పేదల గుడిసెలను తొలగించి నాలుగు ఎకరాలను మాత్రం మినహాయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


పలాస ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు


File No.RDOPLS/3/2025-AO-RDO(PLS)

Rc.No. 565/2025 H3 26/03/2025

Collector's Office, Srikakulam.

From
Sri Swapnil Dinkar Pundkar, IAS.,
Collector & Dist. Magistrate

To
The Deputy Director,
Mines and Geology, Srikakulam.

Sir,
Sub: Mines and Minerals – Srikakulam District – Palasa Mandal- Purushotta puram Village – Request for instructions of Tahsildar, Palasa for excavation of gravel from KV proposed site in Sy.No. 51-1 with an extent of Ac.2.50 cents – Take necessary action- Reg.
Ref: Rc.No. 56/2025 A dt 19.03.2025 of the Tahsildar, Palasa.

... Government taxes may be obtained from SUDA Authorities as per the existing rules and regulations while transporting the excess gravel from KV site to MIG layout, Boddapadu and the SUDA Authorities are requested to pay said seigniorage charges to Mines and Geology Department and also request you to send the report along with copy of seigniorage charges to this office at an early date.

I enclosed herewith a copy of above reference for taking further action in the matter.

Yours faithfully,

గ్రావెల్ తవ్వకాలకు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

విషాహారం నుంచి బయటపడాలంటే..

## సేంద్రియసేద్య ఆహారమే శరణ్యం



(సత్యంన్యూస్, రాజాం)

రసాయనాలు కుమ్మరించిన విషాహారం మనం తినడంతో పాటు, పిల్లలకు పెట్టి చేజేతులా రోగగ్రస్తులను చేస్తున్నామని రాజాం రూరల్ సిఐ హనుమంతు ఉపేంద్ర అన్నారు శుక్రవారం రాజాం నగర పంచాయతీ 17వ వార్డు అమ్మవారి కాలనీలో జాతీయ రైతు నేస్తం పురస్కార గ్రహీత ప్రకృతి వ్యవసాయం రైతు పెంకి గౌరీశ్వర రావు పెరటి తోటలో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఏటిఎం మోడల్ కూరగాయల పెరడును పరిశీలించారు. ప్రతి కుటుంబం ఇంటి ముందు ఖాళీ స్థలంలో గాని డాబాల పైన కూరగాయల వ్యర్థాలతో రెండు మునగ మొక్కలు, టమాటా, వంగ, బెండ మొక్కలు పెంచితే కుటుంబానికి ఆరోగ్యంతో పాటు కూరగాయల ఖర్చు మిగులుతుందన్నారు. పెరటిలో విరగ్గాసిన మునగచెట్టును పరిశీలించి వాటికి వేసిన సేంద్రియ ఎరువుల గురించి తెలుసుకున్నారు. రైతు గౌరీశ్వరరావు మాట్లాతూ పదేళ్లుగా చేస్తున్న ప్రకృతి వ్యవసాయం అనుభవాలతో రసాయనరహితంగా కూరగాయలు పెంచుతూ కుటుంబ అవసరాలు పోను మిగిలినవి ఇతర కుటుంబాలకు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కొత్తా సాయి కుటుంబ సభ్యులు పెంకి చైతన్యకుమార్, చిన్నమ్మలు, అరుణ కుమారి పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

గూడెంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రం సందర్భంగా గ్రామ పురోహితులు పెంటా కిరణ్‌కుమార్ శర్మ, దుండు చిట్టిబాబు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. 18 మంది దంపతులతో ఉదయం నుంచి సుప్రభాత సేవ, అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, కుంకుమార్చన, భజన, సుమారు 3వేల మందికి అన్నసమారాధన జరిపారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరంగం మధుసూదనరావు గురుస్వామి మాట్లాడుతూ ప్రతి హిందువు వ్యక్తిగత సాధనకు, సామాజిక సంఘటనకు సూత్రాన్ని అందించే ప్రయత్నమే అయ్యప్ప జన్మదిన వేడుకలు జరుపుటకు కారణమన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు గుంటముక్కల పాపారావు, ఈదు సతీష్, అప్పలరాజు, చల్ల ప్రసాద్, నల్లాన సురేష్, తారక్, వెంకటరెడ్డి, చిట్టి, రాజు, గోపి, దశరథ, బైరి శ్రీనివాసరావు, పల్ల గోవిందరావు, గుండు సురేష్, దుండు రమణ, కిరణ్, కంచి సన్యాసిరావు, ఎ.అప్పారావు, రాంబాబు, ఎం.లోకేష్, రాము, ఎంపీటీసీ దుండు అప్పలరాజు, సర్పంచ్ వెంకట గోవిందరాజులు, శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం భక్తులు, గూడెం గ్రామప్రజలు పాల్గొన్నారు.





## ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మహిళా సాధికారత, సామాజిక సమరసతలకు జీవన పర్యంతం కృషి సల్పిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా పూలే జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పి.రఘుకృష్ణకు ప్రథమ బహుమతి రాగా, గ్రంథాలయం తరఫున బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూలేకు బీసీ సంఘం నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బడుగు బలహనవర్గాల ఆశా జ్యోతి జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జ్యోతిరావు పూలె పార్క్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బుడుమూరు రాజేష్ పూలమాల వేశారు. సామాజిక విప్లవ జ్యోతి, సమ సమాజ స్థాపనకు నిరంతరం పోరాడిన తొలితరం సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే గారి198వ జయంతిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బహు జన సంఘ నాయకుల ఆధ్వ ర్యంలో కలెక్టరు కార్యాలయం దగ్గర ఉన్న పూలే పార్క్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బేగ్, కృష్ణ, బహుజన నాయకులు కంఠ వేణు, ఎయిమ్స్ జిల్లా అధ్యక్షులు శ్రీను, బిసి సీనియర్ నాయకులు కిల్లాన శ్రీను, నాగరాజు, శంకర్, కృష్ణచంద్, రంగాజి, శంకర్‌రావు, నాగరాజు, సురేష్, జిల్లా అధ్యక్షులు అమీరూల్లా బేగ్, ప్రధాన కార్యదర్శి గద్ది బోయిన కృష్ణారావు, రౌతు శంకరరావు, నాగరాజు, కాయిత వెంకటరమణ, కిల్లన శ్రీనివాస్, గుత్తు చిన్నారావు, ప్రసాద్, కన్నబాబు, సీర సత్యనారాయణ, వి.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా కేంద్ర రూపురేఖలు మారుస్తా

- ఐఏఎస్, ఐపిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి
- బీసీ భవన సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కేంద్ర రూపు రేఖలు మారుస్తానని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతోత్సవం సందర్భంగా శుక్రవారం పొన్నాడ బ్రిడ్జి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, బిసి సంఘం నాయకులు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాంబే కాలనీ వద్ద రూ.5 కోట్లుతో నిర్మించిన వెనుకబడిన తరగతుల సంక్షేమ భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతోత్సవం రోజున 5 కోట్ల రూపాయలతో నిర్మించిన బిసిల భవన సముదాయాన్ని ప్రారంభించడం ఒక గొప్ప శుభపరిణామన్నారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత వచ్చే సమస్యలను ముందుగానే ఆయన గుర్తించిన మహనీయుడని, నేటి తరం ఆయన ఆశయాలను కొనసాగించి ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇదే భవన సముదాయంలో పైన రెండు రూంలు ఏర్పాటుచేసి ఐఏఎస్, ఐపిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు సంబంధించిన మంత్రితో మాట్లాడుతానన్నారు. పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేస్తే వివాహాలు చేసుకోవచ్చన్నారు. డబ్బులు చెల్లించలేని పేద బీసీలకు పెళ్లిల్లు చేసుకునే ఇస్తే ఆశయం సార్థకమవుతుందన్నారు. నిర్వహణ ఔట్ సోర్సింగ్‌కు ఇవ్వమని కలెక్టర్‌కు సూచించారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా బీసీ భవన సముదాయాలను ప్రారంభించుకోవడం గొప్ప శుభపరిణామన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేసిన మంత్రి తిరిగి అదే మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారన్నారు.

స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వచ్చిన వెంటనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్పొరేట్ కళ్యాణ మండపాలకు దీటుగా బీసీల భవనం నిర్మించినట్లు పేర్కొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనసాగించాలని కోరారు. బీసీల అభివృద్ధికి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక పాఠశాలను పూణేలో ఏర్పాటుచేసి ఆయన భార్య సావిత్రి భాయి పూలేకు విద్య నేర్పించి ఆమెనే ఉపాధ్యాయురాలుగా చేసిన మహనీయులన్నారు. ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష మాట్లాడుతూ ఆరోజు చేసిన త్యాగాల ఫలాలు నేడు అనుభవిస్తున్నట్లు చెప్పారు. శాసన మండలి మాజీ సభ్యులు పీరుకట్ల విశ్వప్రసాద్ మాట్లాడుతూ బీసీ భవనాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన పూర్తి చేయక పోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ భవన సముదాయాన్ని పూర్తి చేసి ప్రారంభించినట్లు వివరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ రోజుల్లో ఆయన భార్య సావిత్రి భాయి పూలే బాలికల విద్య కోసం పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. బీసీ కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణమూర్తి నాయుడు, బీసీ, ఏసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనసాగించాలని చెప్పారు.



**మంత్రి చేతుల మీదుగా ఆస్తుల పంపిణీ**

ఈ సందర్భంగా 458 మంది లబ్ధిదారులకు రూ. 8,50,05,000 చెక్కును లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. బీసీ స్వయం ఉపాధి పథకం కింద 435 మందికి రూ.8,05,05,000, జనరిక్ మెడికల్ షాపుకు రూ.8 లక్షలు, మేదర, కుమ్మరి/శాలివాహన ఒకరికి లక్ష రూపాయలు, కాపు (తెలగ, బలిజ, ఒంటరి) 21 మందికి 36 లక్షల రూపాయలు అందజేశారు. సమావేశానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అనూరాధ, ఈడీ గడ్డెమ్మ, తహసీల్దార్ గణపతిరావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పీఎంజే బాబు, బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.